మండు వేసవిలో మిట్టమధ్యాహ్నం వేళ చేతులలో డబ్బాలతోటి బారెడు పొడుగున్న ఆ క్యూ! ఎంతకీ తరగటం లేదనిపిస్తోంది. విసుగ్గావున్నా ఓపిగ్గా నిల్చున్నది ప్రజానీకం. ఏం చేస్తారూ? అత్యవసరం సరకు మరి! గబగబా లీటర్‌తో పోసేస్తున్నాడు అప్పలస్వామి. వాడు ఆ హడవుడిలో లీటర్‌పాత్ర సగమే మునిగి అర్ధలీటర్ సరుకు మాత్రమే పొందగలుగుతున్నారు, అంత శ్రమపడి ఎండలో నిల్చుని కూడ.

"ఏమిటయ్యా! ఆ తొందర! సరిగ్గా నిల్చోండి" అప్పుడప్పుడు అజమాయిషీ చేస్తున్నాడు.

ఆ గొంతులో నీసమంతయినా మర్యాదలేదు, గొడ్లను విదిలించే విసుగు తప్ప.

తల పైకెత్తకుండా డబ్బాలు తీసికొని చకచకా పని పూర్తిచేసుకుంటున్న అప్పలస్వామి వున్నట్టుండి "నీవు పోసేది లీటరా? అర్ధలీటరా?" అన్న ప్రశ్నకు –

తల ఎత్తకుండానే సమాధానం యిచ్చాడు, "ఏం! కళ్ళు కనపడటం లేదా? ఇష్టమయితే పోయించుకో! కష్టమయితే మానుకో" లీటర్ నింపి డబ్బాలో పోయబోతూ తల పైకెత్తి అడిగిన మనిషిని చూసిన అప్పలస్వామి కళ్లు బైర్లు కమ్మాయి.

హడావుడిగా రాయటం పూర్తిచేసిన ఆయన –

"వూఁ! సంతకం పెట్టు" అన్నాడు.

"సర్! ర్!" అంతవరకు పులిలాగ అరచిన అప్పలస్వామి పిల్లిలా మారటం జనాలందరికీ ఆశ్చర్యం కలిగించింది.

"అవన్నీ తరువాత! ఆఫీసుకివచ్చి మాట్లాడు. ముందు సంతకం పెట్టు."

"మీలో ఎవరైనా ఒకరు పెట్టండి" ప్రజానీకం వైపు తిరిగి అన్నారాయన.

ఆ హడావుడి అంతా ముగిసి ఆయన వెళ్ళిపోయాక సుమారు రెండు గంటలకి యిల్లు చేరాడు అప్పలస్వామి.

"ఏంటయ్యా! అట్టున్నావూఁ?" సత్తెమ్మ వివరాలు అడగటంతో మరింత రెచ్చిపోయాడు.

"ఏందే నీ గోల? దిక్కుతోచక నే చస్తుంటే?" కయ్‌మన్నాడు సత్తెమ్మమీద.

అత్తమీద కోపం దుత్తమీద అని పెద్దలు వూర్కే అన్నారా? ఒక గంట సేపటికి అసలు కోపం, చిరాకు తగ్గినాక సాలోచనంగా యిల్లంతా కలియ చూశాడు, అప్పలస్వామి. ఈ గంట సేపటిలో అసలు విషయం తెలుసుకోగలిగింది సత్తెమ్మ.

"మరిపుడేం సేయాలంటావూఁ?" నెమ్మదిగా దిగులుగ అడిగింది.

ఈ వ్యాపారం పట్టాక ఒక్క రవ్వ దిగులు లేకుండా వెళ్ళిపోతున్నాయి రోజులు అనుకుంటే మళ్ళీ యిదొకటా?

"అదేనే! నా ఏడుపు కూడా!" తలమీద గీరాడు అప్పలస్వామి.

మరోసారి యిల్లంతా కలయజూసాడు అతను. ఆ యింట్లో రెండు కుండలు, నాలుగు తపాలాలు తప్ప మరేంలేదు. ఉన్నట్టుండి ఏదో గుర్తుకొచ్చిన వాడిలా లేచి సత్తెమ్మ దగ్గరగా వచ్చాడు, అప్పలస్వామి.

"సత్తీ! నీ దగ్గర నెల రోజులనాడు కొన్నావే బంగారం గొలుసు. అది వుండాలి కదూ! అదిట్టా యియ్యవే?"

"అదా!" నాలుగు నెలలుగా అప్పలస్వామి వ్యాపారం బాగా ఉధృతంగా ఉండటంతో సత్తెమ్మ ఎట్టాగో అది చేయించుకోగలిగింది. అది చేయించుకోటానికి గల కారణం సత్తెమ్మకు దానిమీదవున్న వ్యామోహమే. సత్తెమ్మకు అతి సన్నగా ఓ మోస్తరు పొడవుగా వుండే ఆ గొలుసంటే ప్రాణం.

"అదా ఏంటే! తొందరగా యియ్యహె!" తొందర పెట్టసాగాడు అప్పలస్వామి.

"అది కాదయ్యా! మొన్న నీకు ఒంట్లో బాగలేనపుడు ఏడుకొండలాడికి ముడుపు కట్టాం కదా? అదెట్టమ్ముతావ్!" ఈ మాటంటే దాన్ని అమ్మటానికి సంశయిస్తాడేమో? ఎప్పుడో డబ్బీలో వేసే వస్తువు అంతదాకా అన్నా చూసుకోవచ్చు. అదీ సత్తెమ్మ ఆశ.

"ఏహె! నోర్మూయ్! ముందీ మొక్కు కానీయ్! తర్వాత సూద్దాం అది." త్వరత్వరగా అదే గదిలోవున్న ట్రంకు పెట్టెలోవున్న గొలుసు తీసికొని వెళుతూ అన్నాడు –

"ఆ భగవంతునికి మాత్రము తెలియదంటే పరిస్థితులు! ఏమనుకోడులే."

* * *

మెల్లిగా ఆ ఇంటిని సమీపించాడు అప్పలస్వామి. కుక్కలేమన్నా వున్నాయేమో? భయం భయంగా చూసాడు చుట్టుప్రక్కల. అలాంటి జంతువులేమి లేవని నిర్ధారించుకుని, అయినా ఇపుడు వెళ్ళబోతున్న మనిషికన్నా క్రూర జంతువులా అనుకుని ధైర్యంగా లోపలికి ప్రవేశించాడు.

వీధి గుమ్మానికి ఏడెనిమిది గజాల దూరంలో వున్న సింహద్వారాన్ని చేరేసరికి అతనికి ఏదో భయంగా అన్పించింది. జేబులోవున్న కవరును ఒకసారి తడుముకున్నాడు. ఏదో ధైర్యం ఆవహించినట్టు అన్పించటంతో మెల్లగా తలుపులు తట్టాడు.

తలుపులు తెరుచుకున్నాయి.

తెల్లగా పిండి బొమ్మలావున్న ఒకమ్మాయి తల బయటికిపెట్టి అడిగింది –

"ఎవరు కావాలీ?" ఆ పిల్ల గొంతు విసుగ్గా వుంది. చెప్పాడు అప్పలస్వామి.

"వున్నారు. లోపలికి వచ్చి కూర్చో!" తలుపులు సాంతం తెరచి, అధికారంగా పలికి లోపలికి వెళ్ళిపోయింది.

"మీ కోసం! ఎవరో వచ్చారు" లోపల ఆ పిల్ల గొంతు బయట అప్పలస్వామికి విన్పిస్తూనే వుంది.

"ఎవరూఁ?" అధికారి గొంతు మొరటుగా, మత్తుగా విన్పించింది. పావుగంట తర్వాత ...

ఆయన బయటికి వచ్చారు. ఎర్రగావున్న కళ్ళు. గుప్పుమన్న మత్తు పదార్థ వాసన ఆ పరిసరాలలో విలీనం కాలేకపోతున్నాయి.

అప్పలస్వామి లేచాడు గౌరవ సూచకంగా. అధికారి కనుబొమ్మలు ముడివడ్డాయి. ప్రశ్నార్థకంగా ...

"ఆఁ! సీవటోయ్! ఏమిటిలా వచ్చావు"



అంటూ వచ్చి కుర్చీలో కూర్చున్నాడాయన.

అప్పలస్వామి చెప్పటానికి నోరు తెరచేసరికి –

"తాయమ్మగారూ! నే బోతున్నానండి" దొడ్డి వాకిట్లోనించి వచ్చిన పనిమనిషి గుమ్మం ముందు నిల్చుని అరచింది.

"ఆఁ! రేప్పొద్దున్నే త్వరగా రా! రేపు సాయంత్రం రానవసరం లేదు" ఇందాకటమ్మాయి బయటికివచ్చి చెప్పింది. మళ్ళీ ఒకసారి తండ్రివైపు తిరిగి –

"రేపు వెళ్ళటం ఖాయమే కదూ నాన్నగారూ?" అని అడిగింది.

"ఆఁ! ఆఁ! ఖాయమే!"

"సరే రేపు పెందరాళే రా" అనేసి అక్కడే కూర్చున్న తండ్రిని, అప్పలస్వామిని ఒకసారి చూసి వెళ్ళిపోయింది, తాయీ.

"ఆఁ! ఇపుడు చెప్పు!"

"అదేనయ్యా! మీ కోసమని ఆఫీసుకెళ్ళినా! అయ్యా! మీరేమో సెలవెట్టినారని తెలిసింది అయ్యా!"

వీరి సంభాషణ లోపల కూర్చున్న తాయికి స్పష్టంగా విన్పిస్తోంది. వచ్చిన వ్యక్తి అయ్యా, గియ్యా అంటూవుంటే మరింత కంపరంగావుంది. అసలే ఆ పిల్లకి భలే చికాకుగావుంది. ఆ వచ్చిన వ్యక్తితో పనినంది పూర్తి అయ్యారు ఈ రోజు యింటికి వచ్చిన మనుషులు. తండ్రితో ఏకాంతంగా మాట్లాడాలి అంటే సమయమే దొరకటం లేదు. ఒకరు వెళ్ళిన తరువాత ఎవరో ఒకరు ఎడతెరిపి లేకుండా వస్తూనే వున్నారు.

# గోవింద



తిరుపతి ప్రయాణం దగ్గరకు వస్తోంది ఈలోగా ఎప్పటికి కొనేట్టు అది?

ఆ పిల్ల కళ్ళముందు సన్నగా నాజూకుగా వున్న ఒంటిపేట గొలుసు మెదిలింది తల్లిని అడిగితే —

"నీ మొహంలా వుంది! పట్టుకుంటే తెగేట్టు అదేం గొలుసు?"

వద్దు పొమ్మంది వీళ్ళకేం తెలుసు ఫ్యాషన్ సంగతి? ఓల్డ్ డెవిల్స్! తండ్రిని అడిగినా యిస్తాడన్న నమ్మకం లేదు ఏం చెయ్యాలి?

"అమ్మాయ్! తాయీ!" తండ్రి పిలవటంతో బయటికి వచ్చింది ఇందాక వచ్చిన వ్యక్తి వెళ్ళిపోయినట్టున్నాడు

"ఇదిగో యిది లోపలపెట్టు! నేను త్వరగా బయటికెళ్ళాలి" తన చేతిలోవున్న కవరు తాయికిస్తూ అన్నాడాయన.

"హనుమంతరావుగారూ" బయటినుంచి ఎవరో పిలవటంతో —

"తాళాలు మీ అమ్మకియ్యి!" అనేసి హడావుడిగా వెళ్ళిపోయారు

తాయి కళ్ళు దిగులుగా చూశాయి వెళ్ళిపోతున్న తండ్రిని. అలవాటుగా బీరువా తెరచి అందులో కవరుని జాగ్రత్త చేయబోయిన చేతులు అప్రయత్నంగా ఆగిపోయాయి

ఆమె చేతులు చకచకా కవరు ఓపెన్ చేశాయి అందులోకి దృష్టి సారించింది

తనకు అవసరం అయింది ఆమె ఒక్కక్షణం ఆలోచనగా వుండిపోయింది

తండ్రి డబ్బు లెక్కలు అంతగా పట్టించుకోని మనిషి కాద అనేకంటే లెక్కించుకునే తీరికా, ఓపికాలేని మనిషి అని చెప్పవచ్చు అందుకే ఆమె ధైర్యంగా బీరువా తలుపులు యథాప్రకారం వేసేసి కవరు తీసికొని ఆఫీసు వ్యాన్‌కి యిల్లు అప్పగించి రిక్షాలో నగల కొట్టువైపు వెళ్ళింది

* * *

కొండవీటి చాంతాడులా వుంది ఆ క్యూ! మధ్య మధ్యలో భక్తులు భక్తిపారవశ్యంతో 'గోవింద' అంటూ పాడుతున్నారు

"ఏడుకొండలవాడా! ఆపదమొక్కులవాడా! వడ్డీకాసులవాడా!" అంటూ రకరకాల పేర్లతో భగవంతుని స్తుతించుతున్నారు.

భజనలు, పాటలు, కేకలు, అరుపులు మహా కోలాహలంలా వుంది తిరుపతి దేవస్థానం తెల్లవారుఝాము నుంచి భగవంతుని దర్శనము కొరకు నిరీక్షిస్తున్నారా భక్తులు ధర్మదర్శన క్యూలో

నించొని నించొని కాళ్ళు లాగుతున్నాయి తాయికి ఎంత చెపుతున్నా వినకుండ ధర్మదర్శన మయితేనే నిజమయిన మోక్షం లభిస్తుంది అంటూ లాక్కొచ్చిన తల్లిమీద విపరీతంగా కోపం వస్తోంది

దానికితోడు ఎంతో మోజుపడి కొనుక్కున్న గొలుసు ఎలా బయటపెట్టాలో తెలియకపోవటంతో చెడ్డ చిరాకుగావుంది. మొదటి నుంచి అన్నీ అడ్డంకులే

అంతగా చెప్పి వుంచవయ్యా! అన్నా ఆ కొట్టువాడు మొదటిసారి తను చూసిన గొలుసు అమ్మనే అమ్మాడు పోనీలే అనుకొని అతిసన్నగా ఓ మోస్తరు పొడువుతో నాజూగ్గావున్న మరో గొలుసు నచ్చటంతో అదే కొనేసింది

తీరా యింటికొచ్చాక తండ్రి

"డబ్బు తగ్గిందేమిటి తాయి" అన్నాడు తల్లి ఎక్కడ వింటుందో అని భయం భయంగా పరికిస్తూ తల్లి కనుక వినటం జరిగితే ఇద్దర్నీ తిట్టిపోస్తుంది తనకి యివ్వకుండా దానికెందుకిచ్చావని తండ్రిని, ఎక్కడపెట్టావో సరిగ్గా వెతికి చావవే అంటూ తనని — మరిక నిద్రపోనివ్వదని యిద్దరికీ తెలుసు.

"నాకేం తెలుసు నాన్నా! మీరు పెట్టమన్నారు! పెట్టాను! అంతే! అందులో ఎంత వుందోకూడా నే చూడలేదు" టపీమని చెప్పేసింది, అబద్ధాలు ఆడటం అన్నది నా జన్మహక్కు అన్నంత తేలిగ్గ

ఏం మాట్లాడాలో తెలియని ఆయన —

"వెధవ కొంప! ఎంత డబ్బయినా మింగేస్తుంది" విసుక్కున్నారు అవుడు అది బయట పెట్టి ఏం చెప్పాలో తోచక బయట పెట్టలేదు

తండ్రి నమ్మకపోయినా అంత బాధలేదు. కాని తల్లితోనే పెద్దచిక్కు ఏం చెప్పినా అంత తేలిగ్గ నమ్మదు అనుమానం ముందుపుట్టి తర్వాత ఆవిడ పుట్టింది

తాయికి భలే నిరాశగా అనిపించింది చెప్పుకోటానికి తన తండ్రి పెద్ద అధికారి తనకు మాత్రం ఏవిధంగాను స్వతంత్రంలేదు దానిక్కారణం తమది పెద్దకుటుంబమే అయినా తండ్రికి తల్లికి డబ్బుమీద వున్న నమ్మకం తమ పిల్లలమీద లేక పోవటం కూడ మా మనస్తత్వాలు కుదురుగా వుండవని, మా చేష్టలు కోతి చేష్టలని, వాళ్ళ చెప్పుచేతలలో వుండాలని ఏమిటేమిటో చెపుతుంటారు

తనంటే తల్లికి మరీ అనుమానం ఎక్కువ ఎప్పుడు తనవెంటే తోకలా వుండాలి లేకపోతే ఆవిడకి చచ్చే అనుమానం డబ్బుమీద తప్ప అన్నింటిమీద అనుమానమే ఇలాంటి తల్లికి గొలుసు ఏవిధంగా చూపాలి? అసలు తను చెప్పేది నమ్ముతుందా? ఆ పిల్లకు భయం వేసింది ఈ లాంటిపని ఏ అన్నయ్యవేసినా చెల్లుబాటవుతుంది ఎలాగంటే వాళ్ళేలాగూ సమాధానం చెప్పరు ఇవతలవాళ్ళని లెక్కచేసే పరిస్థితి దాటి చాలాదూరం వెళ్ళారు అందుకే ఈ పనులు చీటికిమాటికి చేసినా భయపడరు పట్టుపడరు ఖర్మ, తను జన్మకో శివరాత్రి లన్నట్టు చెయ్యక చెయ్యకచేస్తే ఏం జరుగుతుందో ఏమిటో? ఆ పిల్లకి తల్లివైపు చూడాలంటేనే భయంగా వుంది

"ఏమిటే నీ పరధ్యానం? త్వరగా రా!" తల్లి చేయిపట్టి గుంజేసరికి ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చింది దాదావు గుళ్ళోకి వచ్చేశారు!

దివ్యంగా మంగళహారతులతో, మంత్రోచ్ఛారణలతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు భగవంతుడు

భక్తుల గోవిందనామస్తుతి మరింత ఉధృతంగా మారింది ఆడవారు మెళ్ళోనుంచి గొలుసులు, చేతుల గాజులు, చెవుల ఆభరణాలు అనేక రకాలు వలిచేస్తు భగవత్ నామములు చదువుతూ దిబ్బెనలో వేస్తున్నారు

"అమ్మా! అదేమిటే? అవన్నీ అలా వేస్తున్నారూ?" తల్లిని అడిగింది

"పిలువుదోపిడియే తల్లీ! సర్వమూ ఆయనివి కదుటే! ఆయనకన్నా ఎక్కువా? నాయనా! ఏడుకొండలవాడా వెంకటరమణా!" టపటపా చెంపలు వాయించుకుంటూ, భక్తిగా కన్నులు మూసుకుంటూ నానా హడావుడి పడిపోతున్నారు సుందరమ్మగారు

తాయి కళ్ళు చటుక్కున మెరిశాయి ఆ బుర్రలో ఒక ఆలోచన చోటు చేసుకుంది వాళ్ళు దాదాపు మొక్కుబడి దిబ్బెనలవరకు వచ్చేశారు. ఆమె జేబురుమాలులోని గొలుసు ఒకసారి తడిమింది ఉన్నట్టుండి ఆమె రుమాలులోని గొలుసు జారవిడిచింది తర్వాత ఏమీ ఎరగనట్టు "అమ్మా! గొలుసే!" అంటూ క్రిందికివంగి గొలుసుని చేతిలోకి తీసికుంది ఆమె పిలుపుకి హనుమంతరావుగారు ఆగి వెనక్కి తిరిగి చూశారు

'ఏదీ' అంటూ ఆ గొలుసు అందుకున్నారు తాయి ఆయనకి అందించింది "అయ్యో! పాపం! ఎవరో దిబ్బెనలో వేయబోతుంటే జారి యివతలకు పడివుంటుంది" అని ఆయన భక్తిగా దాన్ని కళ్ళ కద్దుకొని జాగ్రత్తగా దిబ్బెనలో వేశారు సరిగ్గా అప్పుడే ఎవరో అప్పుడే గుళ్ళోకి ప్రవేశించిన భక్తుడు భగవంతుని చూసి అమిత పారవశ్యంతో "గోవిందా!" అంటూ కేకలు పెట్టాడు అతని కేకను ఉత్సాహంగా అందరూ అందుకున్నారు ఒక్కసారిగా గర్భగుడి అంతా గోవిందా అన్న కేకతో ప్రతిధ్వనించింది